క్లుప్తంగా

వృత్తాకారంలో నిల్చొని ప్రార్థన


ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

ముస్తాబాద్: గణితశాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు రోజుకో ఆకృతిలో ప్రార్థన చేస్తున్నారని ఆవునూర్ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ తెలిపారు. గురువారం వృత్తాకారంలో నిల్చొని, చేశారన్నారు.

దుస్తులు అందజేత



ముస్తాబాద్: చిప్పలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు చిట్నేని వెంకటేశ్వర్‌రావు–మాధవి దంపతులు గురువారం దుస్తులు అందించారని ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కొమ్మెట రాజమల్లు అన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ జ్యోతి, ఎస్‌ఎంసీ చైర్మన్ స్వామి, హెచ్‌ఎం రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు ఇంటింటికీ ఇవ్వాలి

ముస్తాబాద్: అయోధ్య భవ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ ఇవ్వాలని అయోధ్య రామమందిర ట్రస్ట్ ప్రతినిధులు రాంప్రసాద్, భాను కోరారు. ముస్తాబాద్‌లో హిందూ సంఘాలతో గురువారం సమావేశం నిర్వహించారు. అయోధ్యలో పూజ చేసిన అక్షింతలు ముస్తాబాద్ పట్టణానికి వస్తున్నాయని తెలిపారు. వాటిని భారీ ఊరేగింపు ద్వారా ఇంటింటికీ వెళ్లి, భక్తులకు అందించే ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, కామిటికార్ పద్మ, కొండ యాదగిరి, అంజాగౌడ్, ధర్మేందర్, కృష్ణ, కార్తీక్‌రెడ్డి, రాంగోపాల్, రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



ఎల్లారెడ్డిపేట: గ్రామీణ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా అన్నారు. అల్మాస్‌పూర్ కేజీబీవీ విద్యార్థులు జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలవగా గురువారం వారికి మెమొంటోలు అందించి, అభినందించారు. జిల్లా క్రీడాశాఖ అధికారి రాందాస్‌నాయక్, పాఠశాల ప్రత్యేక అధికారి అజంతా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

కోనరావుపేట: కనగర్తి ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు రావులపెల్లి గంగారెడ్డి, సింగం పర్శరాం, బత్తుల రవి గురువారం రూ.5 వేలు విరాళంగా అందజేశారు. హెచ్‌ఎం వినోద్, సర్పంచ్ భారతి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ భూంరెడ్డి వారిని అభినందించారు.

స్కూల్లో ఎఫ్‌ఎం ప్రోగ్రాం

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాలలో గురువారం విద్యార్థులకు బాలానంద కార్యక్రమాన్ని ఆకాశవాణి హైదరాబాద్ ద్వారా ఎఫ్‌ఎం 101.9లో ప్రసారం చేశారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని, టీచర్లు ఉన్నారు.

ధనుర్మాస వేడుకలు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకలను గురువారం నిర్వహించారు. శనివారం ఏకాదశిని పురస్కరించుకొని ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు వేద పండితుడు నవీన్‌చారి తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ జితేందర్, సభ్యులున్నారు.

నేడు క్రిస్మస్ దుస్తుల పంపిణీ

బోయినపల్లి: గంగాధర మండల కేంద్రంలోని వాసు ఫంక్షన్ హాల్‌లో బోయినపల్లి మండల క్రైస్తవ కుటుంబాలకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పుష్పలత తెలిపారు. క్రిస్మస్ విందు ఉంటుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు రావాలని కోరారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

చందుర్తి: ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో కాలు విరిగి, తీవ్ర గాయాలైన ఘటన చందుర్తి మండల కేంద్రంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు. చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన కొలకాని రమేశ్, పెరిక మల్లేశం మండల కేంద్రం నుంచి బైక్‌పై డీజిల్ తీసుకెళ్తున్నారు. అదే సమయంలో రుద్రంగి మండలం మానాలకు చెందిన కారు వేములవాడ వైపు వెళ్తోంది. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో బైక్‌పై వెనుక కూర్చున్న మల్లేశం కాలు విరిగింది. స్థానికులు 108 వాహనంలో వేములవాడ ఆస్పత్రికి తరలించారు.

అప్రోచ్ రోడ్లతో అవస్థలు


మట్టితో నిండిపోయిన డ్రైనేజీ

ఇది మట్టితో నిండిపోయిన రుద్రంగిలోని డ్రెయినేజీ. మండలకేంద్రంలోని కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారి పక్కనే ఉంటుంది. రోడ్డు మరమ్మతులో భాగంగా మట్టితో నిండిపోయింది. దీంతో మురికినీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. సమీప కాలనీలు కంపుకొడుతున్నాయి. డ్రెయినేజీ నిర్మాణానికి టెండర్లు పూర్తయినా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడం లేదు.


ఎక్కడానికి వీలు లేకుండా ఉన్న అప్రోచ్ దారి

ప్రధాన రహదారి పైకి వచ్చేందుకు వీలు లేకుండా ఉన్న ఈ దారి రుద్రంగి గ్రామంలో నుంచి వచ్చే అప్రోచ్ రోడ్డు. ఇటీవల ప్రధాన రోడ్డును నూతనంగా నిర్మించడంతో ఎత్తు పెరిగింది. అప్రోచ్ రోడ్లను సమాంతరంగా చేయకపోవడంతో రుద్రంగి గ్రామస్తులు ప్రధాన రహదారిపైకి వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు.

- మునిగిపోయిన డ్రెయినేజీలు
- కంపుకొడుతున్న కాలనీలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ప్రధాన రోడ్డు ఎత్తుగా ఉండటంతో రుద్రంగిలో పరిస్థితి

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రం నుంచి వెళ్లే కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారిని ఇటీవల నూతనంగా నిర్మించారు. కొత్తగా రోడ్డు వేయడంతో ఎత్తు పెరిగింది. దీంతో రుద్రంగి గ్రామస్తులు తమ కాలనీల నుంచి ఎత్తున ఉన్న ప్రధాన రహదారికి వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది వాహనం పట్టుతప్పి కింద పడ్డ సంఘటనలు ఉన్నాయి. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలు మట్టితో నిండిపోయి కంపుకొడుతున్నాయి.

రూ.12 కోట్లతో రోడ్డు నిర్మాణం

కోరుట్ల–వేములవాడ రహదారిని రూ.12 కోట్లతో నిర్మించారు. వేములవాడ మండలం కోనాయిపల్లి నుంచి రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరాచౌక్ వరకు రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఈ ప్రధాన రహదారి ఎత్తుగా నిర్మించడంలో ఊరిలో నుంచి వచ్చే కాలనీల రోడ్లు డౌన్ అయ్యాయి. దీంతో కాలనీల ప్రజలు ప్రధాన రహదారిపైకి వచ్చే సమయంలో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. రుద్రంగిలోని అంబేద్కర్‌కాలనీ నుంచి ఇందిరాచౌక్ వరకు ఆగస్టులో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించి డిసెంబరులో పూర్తిచేశారు. ఆ పనుల్లోనూ అప్రోచ్ రోడ్లు, ప్రధాన రహదారికి సమాంతరంగా వేయకపోవడం, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ కాలనీల నుంచి రోడ్డుపైకి రావడం కష్టమే..

- రుద్రంగి మండల పరిషత్ నుంచి గ్రామపంచాయతీకి వెళ్లే అప్రోచ్ రోడ్డు
- రుద్రంగి బస్టాండ్ నుంచి అయ్యవార్లకాలనీ, హనుమాన్ ఆలయం వరకు వెళ్లే అప్రోచ్ దారి
- అమరవీరుల స్తూపం ఆవరణ నుంచి రెడ్డి కాలనీకి వెళ్లే అప్రోచ్ దారి డౌన్ అయ్యింది.
- యూనియన్ బ్యాంకు నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే అప్రోచ్‌రోడ్డు వద్ద ప్రమాదకరంగా మారింది.
- ఇందిరాచౌక్ నుంచి బతుకమ్మవాడకు వెళ్లడం కష్టంగా మారింది.
- వేణు మెకానిక్ షాప్ నుంచి యాదవకాలనీకి వెళ్లే రోడ్డు వద్ద ఇబ్బంది పడుతున్నారు.

రోడ్డెక్కే పరిస్థితి లేదు



రుద్రంగిలో అప్రోచ్ దారుల గుండా కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారిపైకి ఎక్కే పరిస్థితి లేదు. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అప్రోచ్ దారులను రోడ్డుకు సమాంతరంగా నిర్మించాలి.

– దేశవేని భూమేశ్, రుద్రంగి

మరమ్మతు చేపడతాం



ప్రధాన రహదారికి ఇరువైపులా సైడ్ డ్రెయినేజీలను త్వరలోనే నిర్మిస్తాం. అప్రోచ్ దారులకు మరమ్మతు చేపడతాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

– సతీశ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

ఓటరు నమోదు పారదర్శకంగా చేపట్టాలి


శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్

ముస్తాబాద్: ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ గణేశ్, మాస్టర్ ట్రైనర్లు వెంకటరమణ, గణేశ్ అన్నారు. ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు స్పెషల్ సమ్మరి రివిజన్–2024పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గురువారం శిక్షణనిచ్చారు. వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయసు పూర్తి చేసుకుంటున్న యువతను ఫాం–06 ద్వారా ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. ఫాం–07 ద్వారా వలస వెళ్లినవారి, మృతి చెందినవారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని, ఫాం–08 ద్వారా జాబితాలోని తప్పొప్పులను సవరించాలని సూచించారు. జనవరి 16 వరకు ఓటరు జాబితా ముద్రణ, ఫిబ్రవరిలో తుది జాబితా ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం బీఎల్‌వోలకు రాత పరీక్ష నిర్వహించారు. నాయబ్ తహసీల్దార్ సురేశ్, ఆర్‌ఐ శ్యాం, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రఘు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి


వేములవాడలో నిరసన తెలుపుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఎల్లారెడ్డిపేటలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ బాధ్యత, సంస్కారం లేకుండా మాట్లాడారని మండిపడ్డారు.

బీజేపీ నాయకుల నిరసన

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో బీజేపీ నాయకులు గురువారం నిరసన తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ తన వ్యవహార శైలి మార్చుకొని, చేసిన తప్పుకు ఉపరాష్ట్రపతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, నాయకులున్నారు.

కోనరావుపేటలో...

కోనరావుపేట: ఉపరాష్ట్రపతికి రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు డిమాండ్ చేశారు. కోనరావుపేటలో గురువారం ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. మాజీ వైస్ ఎంపీపీలు తీగల రవీందర్‌గౌడ్, అంబోజి లక్ష్మీనారాయణ, నాయకులున్నారు.

ఇల్లంతకుంటలో..

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్ మాట్లాడుతూ.. ఉపరాష్ట్రపతిపై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను ఖండించారు. ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొలనూరు ముత్తక్క, దళిత మోర్చా అధ్యక్షుడు మామిడి శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

చందుర్తి: రాహుల్‌గాంధీ ఉపరాష్ట్రపతికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ చందుర్తి మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాహుల్‌గాంధీకి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. పార్లమెంటు కాంప్లెక్స్ వద్ద తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఉపరాష్ట్రపతిని మిమిక్రీ చేయడాన్ని రాహుల్‌గాంధీ వీడియో తీసి, వ్యంగంగా మాట్లాడి రాజ్యాంగాన్ని అవమానించారని అన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, వేములవాడ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి చిర్రం తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

బోయినపల్లి: స్నేహితురాలి భర్త మృతిచెందగా ఆమెతో కలిసి చదువుకున్న ఎస్సెస్సీ 1993–94 బ్యాచ్ విద్యార్థులు గురువారం రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన గన్రెపల్లి రజిత స్థానిక హైస్కూల్ పూర్వ విద్యార్థిని. ఆమె భర్త శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రజిత చిన్ననాటి స్నేహితులు తమ ఎస్సెస్సీ బ్యాచ్ వాట్సాప్ గ్రూప్ ద్వారా డబ్బులు జమ చేశారు. గురువారం ఆమె ఇంటికి వెళ్లి, ఓదార్చి, ఆర్థికసాయం అందించారు. భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ముస్తాబాద్ : స్వర్ణకారులను కొత్త ప్రభుత్వం ఆదుకోవాలని స్వర్ణకారుల సంఘం మండల బాధ్యుడు చింతోజు బాలయ్య కోరారు. ముస్తాబాద్ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం స్వర్ణకారుల సమావేశం నిర్వహించారు. చేతివృత్తిదారులైన స్వర్ణకారుల ఆదాయానికి కార్పొరేట్ కంపెనీలు గండి కొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పట్టణాల్లోనూ షాపింగ్‌మాల్స్ వస్తున్నాయని, దీంతో వేలాది మంది స్వర్ణకారులు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. ప్రభుత్వం అర్హులకు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని, పోలీసు కేసుల నుంచి కాపాడాలని కోరారు. నాయకులు వెంకటేశ్, జగన్నాథచారి, కిషన్, రాజేందర్, మిస్త్రీ, శ్రీధర్, సంతోష్ పాల్గొన్నారు.

నారుమడి యాజమాన్య పద్ధతులు

- ఎరువులు, జింక్ సల్ఫేట్ వేసుకోవాలి
- ఉదయాన్నే వేడినీరు పెట్టాలి
- చందుర్తి ఏవో దుర్గారాజు


నారుమడిని పరిశీలిస్తున్న ఏవో దుర్గారాజు

చందుర్తి: యాసంగి నారుమడిలో రైతులు తగు యాజమాన్య పద్ధతులు పాటిస్తే నారు ఆశించిన స్థాయిలో ఎదుగుతుందని చందుర్తి మండల ఏవో సీహెచ్.దుర్గారాజు అన్నారు. గురువారం ఆయన పలు గ్రామాల్లోని నారుమడులను ఏఈవోలు శారద, రమ్యలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. చల్లటి వాతావరణం దృష్ట్యా నారుమడికి ముందు రైతులు బాగా మాగిన పశువులు పేడ, కోళ్ల ఎరువు, జింక్ సల్ఫేట్ వేసుకోవాలన్నారు. అలాగే భాస్వరం అందించే ఎరువులను వినియోగించాలని, నారుమడికి ప్రతీరోజు ఉదయాన్నే వేడినీటిని పెట్టాలని పేర్కొన్నారు. రాత్రిపూట ఉష్ణోగ్రతలు 10 సెంటిగ్రేడ్‌ల కంటే తక్కువగా ఉంటే నారు ఎర్రబడటం, ఎదుగుదల లోపించడం జింక్ సల్ఫేట్ లోపం వల్ల జరుగుతాయని తెలిపారు. నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. నాటు వేయడానికి వారం రోజుల ముందు నారుమడికి 400 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకలో కలిపి, చల్లుకునేందుకు నారుమడిలో పలుచగా నీరు ఉంచాలని చెప్పారు. దీనివల్ల కాండం తొలిచే పురుగు ఉధృతిని కొంతమేర తగ్గించవచ్చని పేర్కొన్నారు.

'ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించబోం'


మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

తంగళ్లపల్లి: ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించబోమని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై గ్రామస్థాయి నుంచి విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు బైరినేని రాము, నాయకులు నేరెళ్ల నర్సింగం గౌడ్, కటకం రాజశేఖర్, శ్రీకాంత్ గౌడ్, పొన్నాల పర్శరాం, మునిగెల రాజు, బాలసాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర


మానాలలో మాట్లాడుతున్న అధికారులు

ముస్తాబాద్: గూడెం గ్రామంలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఎంపీడీవో రమాదేవి వివరించారు. ఉపాధిహామీ, వైద్యం, విద్య, అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సరఫరా వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీబీ రోగులకు నెలకు రూ.500 చొప్పున కేంద్రం ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్నేని సరిత, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీధర్, వైద్యాధికారి గీతాంజలి, ఏపీవో ఆనంద్, ఏపీఎం దేవరాజు, ఐకేపీ ఏపీడీ పాపారావు, సిబ్బంది నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానాల జీపీ కార్యాలయంలో..

రుద్రంగి: మానాల జీపీ కార్యాలయంలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ మానస, ఎంపీడీవో శంకర్, వైస్ ఎంపీపీ చిన్న భూమయ్య, వైద్యాధికారి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జగన్



చందుర్తి: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పాలెపాక జగన్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ, ప్రధాన కార్యదర్శి గొంటి రవి గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి రవి, సంయుక్త కార్యదర్శి మడుగుల కృష్ణాకర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్పత్రిలో బాధితులకు పరామర్శ


ఆస్పత్రిలో బాలికను పరామర్శిస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లను టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు గురువారం రాత్రి పరామర్శించారు. గంభీరావుపేట మండలంలోని గజసింగవరానికి చెందిన సత్తయ్య, అతని కూతురు ఆస్పత్రిలో ఉండగా వైద్య ఖర్చులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన ఆటోడ్రైవర్ కుమారుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యుడు అభినయ్‌ని అడిగి తెలుసుకున్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

'కల్యాణలక్ష్మి, షాదీముబారక్' మంజూరు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలోని 32 మంది లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల్లో భాగంగా ఆర్థిక సాయం మంజూరైనట్లు ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతగిరిలో ఐదుగురు, కందికట్కూర్ నలుగురు, వల్లంపట్ల ముగ్గురు, ముస్కానిపేట, సోమారంపేట, తిప్పాపూర్‌లలో ఇద్దరు చొప్పున, దాచరం, గొల్లపల్లి, జంగంరెడ్డిపల్లి, ఓబులాపూర్, పత్తికుంటపల్లె, పెద్దలింగాపూర్, పొత్తూరు, రహీంఖాన్‌పేట, రామాజిపేట, రంగంపేట, రేపాక, వెల్జిపూర్, వెంకట్రావుపల్లెలో ఒక్కొక్కరికి సంబంధిత చెక్కులను త్వరలో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

జాతీయ పోస్టు డాక్టోరల్ ఫెలోగా ఎంపిక


అవార్డు అందుకుంటున్న రవికుమార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన సంద్ర రవికుమార్ పీహెచ్‌డీలో డాక్టరేట్ పట్టా పొందడమే కాకుండా పరిశోధన రంగంలో జాతీయస్థాయి పోస్టు డాక్టోరల్ ఫెలోగా ఎంపికయ్యారు. పోస్టు డాక్టోరల్‌గా అవార్డు అందుకున్న రవికుమార్‌ను పలువురు అభినందించారు. రవికుమార్ కాకతీయ విశ్వవిద్యాలయంలో బీఈడీ, ఎంఏ ఎకానామిక్స్ పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎకానమిక్స్‌లో పీహెచ్‌డీ పూర్తిచేసి యూనివర్సిటీ వీసీ, ఆడోబ్ సీఈవో చేతులమీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. పరిశోధన రంగంలో అత్యున్నతమైన పోస్టు డాక్టోరల్ ఫెలోకు ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలకు..


వాసు

కోనరావుపేట(వేములవాడ): రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలకు కోనరావుపేట మండలం కనగర్తి హైస్కూల్ విద్యార్థి బత్తుల వాసు ఎంపికైనట్లు జిల్లా అసోసియేషన్ సెక్రెటరీ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో జరిగిన అండర్–18 విభాగంలో 6 కిలోమీటర్ల పరుగుపందెంలో బత్తుల వాసు పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచాడు. వాసును హెచ్‌ఎం వినోద్‌కుమార్, సర్పంచ్, ఎస్‌ఎంసీ చైర్మన్, పీఈటీ అజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

ద్విచక్రవాహనం దహనం



తంగళ్లపల్లి: మండలంలోని దేశాయిపల్లె గ్రామంలో మ్యాకల చంద్రయ్య తన బైక్‌ను బుధవారం రాత్రి ఇంటి బయట నిలపగా.. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. బైక్ నుంచి ఎగిసిపడిన మంటలు ఇంటికి అంటుకుంటున్న క్రమంలో గుర్తించిన గ్రామస్తులు కేకలు వేసి మంటలను ఆర్పివేశారు. బాధితుడు చంద్రయ్య ఫిర్యాదుతో తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సిరిసిల్ల విద్యార్థికి యూనివర్సిటీ మెడల్


వేణును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

సిరిసిల్లటౌన్: శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన యూనివర్సిటీ లెవల్ స్పోర్ట్స్‌లో సిరిసిల్లకు చెందిన వికాస్ డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థి అనవేని వేణు సిల్వర్‌మెడల్ సాధించాడు. బీకాం ఫస్ట్ ఇయర్ చదువుతున్న వేణు లాంగ్‌జంప్‌లో సిల్వర్ మెడల్ గెలిచాడు. వేణు కాలేజీ ప్రిన్సిపాల్ దిడ్డి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ నామపురం దేవరాజు, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, అజీమ్ అభినందించారు.